నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
మంగళవారం | డిసెంబర్ 26, 2023 | www.navatelangana.com

గుర్తింపు ఎన్నికల్లో బీఎంఎస్‌ను గెలిపించండి

నస్పూర్: సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్(బిఎంఎస్)ను గెలిపించాలని బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి, సీఎంపీఎఫ్ బోర్డు సభ్యులు కొత్తకాపు లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం ఆర్కే 5 గనిపై సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి సత్తయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. సింగరేణిలో 7వ దఫా డిసెంబర్ 27న జరిగే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో గెలిపిస్తే పరిశ్రమ పరిరక్షణ, కార్మికుల సంరక్షణ, కార్మికుల ఆత్మగౌరవం, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తామని తెలిపారు. సింగరేణి కార్మికుల ఆదాయ పన్ను, రీయింబర్స్‌మెంట్ చెల్లించే విధంగా కృషి చేస్తామని, సొంతింటి పథకం అమలు చేయడానికి ప్రతి కార్మికునికి 250 గజాల భూమి, వడ్డీ లేని రుణ సదుపాయం కల్పించేందుకు పని చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు, బొగ్గు బకాయిలు సుమారు రూ.26వేల కోట్లు సింగరేణి యాజమాన్యానికి చెల్లించాలని సంవత్సర కాలం నుంచి సంఘం ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి గనులపై నిరసన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. అయినా ఇప్పటివరకు చెల్లించలేదని, ఉద్యమాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నుండి రావలసిన బకాయిలు సింగరేణి యాజమాన్యానికి చెల్లించే విధంగా కృషి చేస్తామని పేర్కొన్నారు.

శ్మశానవాటికలో బోరుబావి నిర్మాణ పనులు ప్రారంభం

కాగజ్‌నగర్ రూరల్ : మండలంలోని నజ్రూల్‌నగర్ మార్కెట్ ఏరియా శ్మశాన వాటికలో సోమవారం బోరుబావి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. గ్రామ పంచాయతీ నిధులు రూ.1.80లక్షల అంచనా వ్యయంతో బోరుబావి నిర్మాణం పనులకు సర్పంచ్ అనూప ఘరామి భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ శ్మశాన వాటికలో ఇంత కాలంగా నీటి వసతి లేనందున అంత్యక్రియల అనంతరం వాగులు, ఒర్రెల్లో స్నానాలు చేయాల్సిన పరిస్థితి ఉండేది. బోరు బావి నిర్మాణంతో నీటి సమస్య తీరిపోనుంది. ఈ కార్యక్రమంలో రాంనగర్ ఎంపీటీసీ బికాస్ ఘరామీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాళిదాస్ మజూందర్, ఉపసర్పంచ్ తేజస్వి, కో ఆప్షన్ సభ్యుడు సమీర్ గుప్తా, వార్డు సభ్యులు రణవీర్, బిస్వాస్, కారోబార్ చైన్రావ్ పాల్గొన్నారు.



నిస్వార్థంగా పనిచేసే సీఐటీయూని గెలిపించండి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్



నవతెలంగాణ-నస్పూర్

డిసెంబర్ 27న జరిగే సింగరేణి ఎన్నికల్లో కార్మికులకు ద్రోహం చేసే సంఘాలను పక్కనపెట్టి పోరాడే సీఐటీయూని గెలిపించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ అన్నారు. సోమవారం శైల శ్రీనివాస్ అధ్యక్షత సింగరేణి ఏరియా వర్క్‌షాప్‌లో జరిగిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. 1998 నుంచి ఇప్పటి వరకు జరిగిన ఆరు ఎన్నికల్లో గెలిచిన సంఘాల నాయకుల వల్లనే ప్రయివేటీకరణ, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానాలు, బొగ్గు బావులు ప్రయివేట్ కావడం, ఉద్యోగుల సంఖ్య తగ్గటం జరిగిందని పేర్కొన్నారు. 2011 నుంచి కార్మికులకు రావాల్సిన పెరిక్స్ మీద ఇన్కమ్ టాక్స్‌ను ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ ఇప్పించలేకపోయాయని అన్నారు. సీఐటీయూని గెలిపిస్తే అవినీతికి అవకాశం లేకుండా కార్మికుల సంక్షేమ కోసం, కార్మికుల సొంతింటి కోసం పోరాటం చేస్తామన్నారు. సింగరేణికి రావలసిన ప్రభుత్వ బకాయిలను వసూలు చేయడం కోసం పోరాడుతామన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారంగా సమాన పనికి సమాన వేతనం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏరియా బ్రాంచ్ కార్యదర్శి గోదారి భాగ్యరాజు, ఆర్కే5 ఫిట్ సెక్రటరీ శ్రీనివాస్, ఆర్కే6 ఆర్గనైజర్ మహేష్, విజయ్, సిహెచ్ సాగర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రిటైర్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నస్పూర్ : సింగరేణిలో పదవీ విరమణ పొందిన కార్మికుల సమస్యలు యాజమాన్యం, ప్రభుత్వం, కార్మికు సంఘాల నాయకులు స్పందించి పరిష్కరించాలని బహిరంగ లేఖ ద్వారా తెలుపుతున్నట్లు విశ్రాంత కార్మికులు పేర్కొన్నారు. సోమవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సింగరేణిలో 30 సంవత్సరాల నుండి దాదాపు 85,000 మంది కార్మికులు పదవీ విరమణ పొందారని, అందులో కనీస పెన్షన్ రూ.1000 కూడా పొందలేని కార్మికులు ఉన్నారన్నారు. వారి గురించి యాజమాన్యంగాని, ప్రభుత్వంగాని, సంఘాలు గాని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. సంస్థ మనుగడలో తమ పాత్ర కూడా ఉందని, ఇప్పుడు తమకు ఓటు హక్కు లేదని తమ గురించి పట్టించుకోకపోవడం అన్యాయమని తెలిపారు. సింగరేణి విశ్రాంత కార్మికులకు 25 నుండి 50 శాతం వరకు పెన్షన్ పెంపుదలకు కృషి చేయాలని, కనీస పెన్షన్ రూ.10000 నుండి రూ.15000గా నిర్ణయించాలని, అధికారుల మాదిరిగానే పెరిగిన గ్రాట్యుటీ రూ.20లక్షలు చెల్లించాలని, అధికారుల మాదిరిగానే సిపిఆర్ఎంఎస్ మెడికల్ స్కీమ్‌లో రూ.25లక్షల వరకు వైద్య ఖర్చులు చెల్లించాలని కోరారు. సింగరేణి ఏరియా హాస్పిటల్‌లో విశ్రాంతి కార్మికులకు ఉచితంగానే వైద్య సౌకర్యాలు అందించాలని, సొంత ఇల్లు లేని కార్మికులకు ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం 200 గజాల ఇంటి స్థలాన్ని ఇచ్చి, వడ్డీ లేని రూ.15లక్షలు రుణాన్ని అందజేయాలన్నారు. పదవీ విరమణ పొందిన కార్మికులకు ప్రభుత్వం కూడా పెన్షన్ మంజూరు చేయాలని, రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులను కూడా అందించాలని పేర్కొన్నారు. సింగరేణిలో పనిచేసి దేశానికి వెలుగులు అందించిన విశ్రాంత ఉద్యోగుల జీవితాల్లో చీకటి అలుముకుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక సంఘాలు గుర్తింపు ఎన్నికల మేనిఫెస్టోలో విశ్రాంత కార్మికుల సమస్యలు పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత కార్మికులు రాళ్లబండి రాజన్న, పూదరి నర్సయ్య, కె.రాజన్నగౌడ్, శంకర్‌రావు, రవీందర్‌రావు, కృష్ణ, రాజారెడ్డి, అంజయ్య, రాజేశం, తిరుపతిరావు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీకి ఓటు అడిగే హక్కు లేదు




నస్పూర్ : గతంలో గుర్తింపు సంఘాలుగా పనిచేసిన ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ నాయకులు కార్మికుల హక్కులు సాధించడంలో విఫలమయ్యారని, వారికి ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు లేదని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షులు తిప్పారపు సారయ్య అన్నారు. సోమవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో ఈ యూనియన్‌లు గుర్తింపు సంఘాలుగా ఉన్నప్పుడు 1995-2004 మధ్య కాలంలో దాదాపు పదివేల మంది కార్మికులు డిస్మిస్ అయ్యారని, 2023లో ఏఐటీయూసీ ప్రతిపక్షంగా ఉన్న భూపాలపల్లిలో 49 మంది కార్మికులను డిస్మిస్ చేసినా కూడా పట్టించుకోలేదని ఆరోపించారు. సింగరేణి ఉన్నత పాఠశాలలు అంచెలంచెలుగా కనుమరుగయ్యాయని, డిస్పెన్సరీలు కూడా కనుమరుగవుతున్నా పట్టించుకోలేదని అన్నారు. ఏఐటీయూసీ నాయకులు కార్మికుల వద్ద నుండి బలవంతంగా చందాలు వసూలు చేసి భవనాలు కడుతున్నారని ఆరోపించారు. ఐఎన్టీయూసీ గుర్తింపు సంఘంగా ఉన్న కార్మికులకు సరైన వైద్యం అందించడంలో విఫలమయ్యారని, కార్పొరేట్ ఆసుపత్రి అందుబాటులో లేక కార్మికులు తీవ్ర అవస్థలకు గురికావాల్సి వస్తుందని తెలిపారు. కార్మిక హక్కులను కాలరాసే యూనియన్లను విస్మరించి హెచ్ఎంఎస్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి అనిల్‌రెడ్డి, తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కామెర కట్టయ్య, కో కన్వీనర్ జైపాల్, నాయకులు దుర్గం లక్ష్మణ్, పంబాల నర్సయ్య, అశోక్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

ఆరింటిపై ఆశలెన్నో..!

- ఈ నెల 28 నుంచి 'ప్రజా పాలన' సభలు
- గ్రామాలు, వార్డుల వారీగా దరఖాస్తుల స్వీకరణ
- సొంతింటి కల..గ్యాస్ రాయితీపై అమితాసక్తి
- సర్కారు సాయంతో కౌలు రైతులకు ఉపశమనం
- కొత్త పథకాల అమలుపై లబ్ధిదారుల్లో ఆతృత

కొత్త ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారెంటీలపై జనాలు అనేక ఆశలు పెట్టుకున్నారు. అధికారంలోకి వస్తే కచ్చితంగా అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. చెప్పినట్లుగానే కార్యాచరణ ప్రారంభించింది. ఈ నెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు 'ప్రజాపాలన' పేరిట గ్రామాలు, మున్సిపాలిటీల్లో సభలు నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ఈ సభలకు సంబంధించి విధివిధానాలను ప్రభుత్వం జిల్లా కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులకు వివరించడంతో పాటు మార్గదర్శకాలను విడుదల చేసింది. దీంతో అధికార యంత్రాంగం ఆయా సభల నిర్వహణకు కసరత్తు ప్రారంభిస్తోంది. మరోపక్క గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలతో పాటు కాంగ్రెస్ కొన్నింటిని కొత్తగా అమలు చేయనుండటంతో జనాల్లోనూ అమితాసక్తి నెలకొంది. నిరుపేదలకు అత్యవసరమైన సొంతింటి కలతో పాటు రూ.500లకే గ్యాస్ సిలిండర్‌తో పాటు కౌలు రైతులకు ఆర్థిక సాయంపైనా ఆసక్తి రేకెత్తిస్తోంది. ఆయా పథకాల అమలుపై ఉమ్మడి జిల్లా ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోవడం.. కొత్త సర్కారు కొలువుదీరడంతో జనాలు సంక్షేమ కార్యక్రమాలపై భారీగా ఆశలు పెట్టుకున్నారు. గతంలోనూ సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు అమలైనా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలపై మాత్రం జనం భారీగా నమ్మకం పెట్టుకున్నారు. ఇది వరకు పింఛన్లు, రైతుబంధు వంటి పథకాలు వచ్చినా.. తాజాగా వీటి పెంపుతో పాటు కొత్త పథకాలు అమలు కానుండటంతో జనంలో ఆసక్తి నెలకొంది. ప్రభుత్వం కొలువుదీరిన రెండు రోజులకే మహాలక్ష్మీ పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ప్రారంభించింది. చేయూత పథకంలో భాగంగా ఆరోగ్య శ్రీ వైద్యాన్ని రూ.10లక్షలకు పెంచింది. వీటితో పాటు మిగిలిన వాటికి సైతం వంద రోజుల్లో అమలు చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేయడంతో జనాలు వాటిపై ఆసక్తి కనబరుస్తున్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వం ఇది వరకు రైతులకు రైతుబంధు ఎకరానికి రూ.10వేల చొప్పున అందజేసింది. కానీ కాంగ్రెస్ సర్కారు ఈ సాయాన్ని రూ.15వేలకు పెంచింది. ముఖ్యంగా గతంలో ఎన్నడూలేని విధంగా కౌలు రైతులకు కూడా ఈ సాయం వర్తింపజేస్తామని ప్రకటించడంతో కష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న కౌలు రైతులకు ఉపశమనం లభించనుంది. ముఖ్యంగా వ్యవసాయ కూలీలకు సైతం రూ.12వేలు అందిస్తామని స్పష్టం చేసింది. వీటితో పాటు గత ప్రభుత్వం డబుల్‌బెడ్ రూంల పేరు చెప్పి కాలయాపన చేసింది. అక్కడక్కడ కొన్ని ప్రాంతాల్లో మాత్రమే నిర్మించి వదిలేసింది. కానీ తాజాగా కాంగ్రెస్ సర్కారు ఇందిరమ్మ ఇండ్ల కోసం రూ.5లక్షలు వెచ్చించనుంది. వీటికి సంబంధించి దరఖాస్తులు స్వీకరించడంతో పాటు గృహనిర్మాణశాఖను పునరుద్ధరించనుంది. దీంతో ఇండ్లు లేని వేలాది మంది నిరుపేదలు ఈ పథకంపై ఆశగా ఎదురుచూస్తున్నారు. విద్యుత్ బిల్లులు చెల్లించలేక అవస్థలు పడిన పేదలకు ప్రభుత్వం గృహజ్యోతి పేరిట 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని కల్పించనుంది. ముఖ్యంగా ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ కోసం రూ.1100 వరకు వెచ్చించాల్సి వస్తోంది. కానీ కాంగ్రెస్ సర్కారు రూ.500కే సిలిండర్ అందజేస్తామని చెబుతోంది.

ఈ నెల 28 నుంచి దరఖాస్తులు

ప్రభుత్వం ఆరుగ్యారెంటీల అమలులో భాగంగా ఈ నెల 28వ తేదీ నుంచి రాష్ట్రంలో ప్రజా పాలన పేరిట సభలు నిర్వహించనుంది. ఈ సభల్లోనే మహాలక్ష్మీ, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలకు సంబంధించి లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించనుంది. ఇందుకు అధికార యంత్రాంగం గ్రామాలు, మున్సిపాలిటీల్లో వార్డుల్లో సభలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ పథకాలతో పాటు ప్రత్యేకంగా రేషన్‌కార్డుల కోసం సైతం కౌంటర్ ఏర్పాటుచేస్తామని ప్రభుత్వం పేర్కొంది. డిసెంబర్ 31, జనవరి 1వతేదీల్లో మినహాయించి ఎనిమిది రోజుల పాటు ఈ దరఖాస్తులు తీసుకుంటారని అధికారవర్గాలు చెబుతున్నాయి. గతంలో పొందిన కొన్ని పథకాలతో పాటు కొత్తగా మరిన్ని అమలు కానుండటంతో లబ్ధిదారుల్లో ఆతృత నెలకొంది. ఈ పథకాలు సక్రమంగా అమలు చేస్తే పేదల జీవితాల్లో కొంతైనా మార్పు వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా పని చేయాలి

- ప్లీనంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా పని చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. పార్టీ జిల్లా స్థాయి ప్లీనం పట్టణంలోని రోజ్ గార్డెన్‌లో జరిగింది. దీనికి ఎస్.వీరయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ఏర్పాటైన కొత్త కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. వీటి అమలుకు కింది స్థాయిలో పార్టీ కార్యకర్తలు పోరాటం చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో కుమురం భీం ప్రాజెక్ట్ కాలువలు పూర్తికాక ముందే కూలిపోతోందన్నారు. తుమ్మిడిహేటి వద్ద గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిందని, ఈ ప్రాజెక్టును పూర్తి చేసి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. దీంతో పాటు పెండింగ్‌లో ఉన్న జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టును కూడా పూర్తి చేయాలని కోరారు. జిల్లాలో గత ప్రభుత్వం మెడికల్ కాలేజీ ప్రారంభించినప్పటికీ టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌ను భర్తీ చేయలేదన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్ర ఆసుపత్రితో పాటు జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లు లేని పరిస్థితి ఉందని తెలిపారు. జిల్లాలో రోడ్లు కూడా అస్తవ్యస్తంగా ఉన్నాయని, కొత్త ప్రభుత్వం, నూతన ఎమ్మెల్యేలు బాగుకు కృషి చేయాలని పేర్కొన్నారు. పార్టీ యావత్తు నిత్యం ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు గొడిసెల కార్తిక్, ముంజం శ్రీనివాస్, ముంజం ఆనంద్‌కుమార్, జె.రాజేందర్, దుర్గం రాజ్‌కుమార్, నాయకులు జాడి మల్లయ్య, టికానంద్ పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం

- బీఆర్ఎస్ ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసింది
- రాహుల్‌గాంధీని గొప్ప ప్రధాని చేయడమే లక్ష్యం
- నాగ్‌పూర్‌లో పార్టీ ఆవిర్భావ సభకు భారీగా తరలిరావాలి
- మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ పిలుపు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

బీజేపీ పాలనలో దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యమయ్యాయని దేశం సంపద కొల్లగొడుతూ కులం, మతం పేరుతో రాజకీయాలు చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. బీజేపీ ముక్త్ భారత్‌కు పిలుపునిస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి మాట్లాడారు. అధికారంలోకి వస్తే దేశంలో ప్రతి ఏటా 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన బీజేపీ ప్రభుత్వం ఒక్కరికీ ఇవ్వలేదని స్పష్టం చేశారు.ఈ నెల 28న కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరుగుతాయని ఈ సమావేశానికి పార్టీ అగ్రనేతలు మల్లికార్జునఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ వంటి నాయకులు హాజరవుతారని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి వేలాది మంది ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని పిలుపునిచ్చారు. రాహుల్‌గాంధీని గొప్ప ప్రధాని చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషిచేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్మించిందని, కూడు, గూడు, నీడ కల్పించిందని గుర్తుచేశారు. అవుట్‌రింగ్‌రోడ్డు, భవనాలు, సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో అధికారంలోకి రాగానే రెండు గ్యారెంటీలను అమలు చేశామని మిగితా వాటి కోసం ఈ నెల 28 నుంచి దరఖాస్తులు తీసుకుంటామని చెప్పారు. బీఆర్ఎస్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని రూ.7లక్షల కోట్ల అప్పులు చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను తీసుకొస్తుందని, ప్రతి పైసాకు జవాబుదారితనం తీసుకొస్తామని అన్నారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితిపై తమ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేస్తే బీఆర్ఎస్ బుకాయించే ప్రయత్నం చేసిందని తెలిపారు. న్యాయ విచారణకు ఆదేశించగానే వారి నోళ్లు మూతపడ్డాయని విమర్శించారు. రాష్ట్రాన్ని రూ.7లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టిందని వివరించారు. ఓడిపోయిన చోట్ల పార్టీ శ్రేణులు అధైర్యపడకూడదని లోక్‌సభ ఎన్నికలపై దృష్టిసారించాలని సూచించారు. నాగ్‌పూర్‌లో నిర్వహించే ఆవిర్భావ సభకు ప్రజలు భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్‌చౌదరి, విశ్వనాథ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, వెడ్మ బొజ్జు, మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, ఆయా నియోజకవర్గాల ఇన్‌ఛార్జీలు కంది శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరావుపటేల్, రావి శ్రీనివాస్, శ్యాంనాయక్, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, నాయకులు సత్తు మల్లేష్, బాలూరి గోవర్ధన్‌రెడ్డి, నరేష్‌జాదవ్, గోక గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అమరవీరులకు నివాళ్లర్పించిన మంత్రి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

తెలంగాణ రాష్ట్రం ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో పాటు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి సోమవారం హీరాపూర్‌లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళ్లర్పించారు.



ఆయన కరీంనగర్ నుంచి ఆదిలాబాద్‌కు వెళ్తుండగా స్థానిక కాంగ్రెస్ నాయకులు మెస్రం నాగ్‌నాథ్, సోముర్ నాగోరావ్, వెంకట్‌రావ్, ఎండీ.మసూద్‌లు ఘన స్వాగతం పలికారు. ఆనాడు 1981లో ఆదివాసులు జల్, జంగల్, జమీన్ కోసం శాంతి యుతంగా సమావేశం ఏర్పాటు చేస్తుండగా పోలీసులు జరిపిన కాల్పుల్లో అనేక మంది ఆదివాసీ బిడ్డలు అమరులయ్యారని స్థానిక ఆదివాసీ నాయకులు ఆయనకు వివరించారు.

రాజ్యాంగం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

నవతెలంగాణ-బేల

రాజ్యాంగం గురించి ప్రతి తెలుసుకోవాలని సమతా సైనిక దళ్ ప్రతినిధి దీపక్ వాగ్మరే అన్నారు. జనవరిలో నిర్వహించే శ్రామ్నెర్ శిబిరంపై అవగాహన కల్పించేల చేపట్టిన బైక్ మార్చ్ ఆదివారం మండలానికి చేరుకుంది. ముందుగా డా.బాబా సాహెబ్ అంబేద్కర్‌కు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దీపక్ వాగ్మారే మాట్లాడుతూ రాజ్యాంగం రచించి 74సంవత్సరాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా సమతా సైనిక దల్ అధ్వర్యంలో జిల్లా, మండల కేంద్రాలో ర్యాలీ చేపడుతున్నామన్నారు. అదే విధంగా జనవరిలో పది రోజుల శ్రామ్నెర్ శిబిరం నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరారు.



ఘనంగా మాజీ ప్రధాని జయంతి వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భరత రత్న, మాజీ ప్రధాని అటల్ బీహారి వాజ్‌పేయి 99 వ జయంతి వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జయంతికి ఎమ్మెల్యే పాయల శంకర్ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ ప్రధాని స్వర్గీయ అటల్ బీహారీ వాజ్‌పాయ్‌కు ఆదిలాబాద్ జిల్లాకు అవినాభావ సంభందం ఉందన్నారు. ఆదిలాబాద్‌కు దేశం నలుమూలలను కలిపే నాలుగు వరసల జాతీయ రహదారి ఆయన చొరువతోనే సాధ్యమైందన్నారు. దేశ ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీరందించాలనే ఉద్దేశ్యంతో సుజల యోజనను ఆయన తొలిసారి ఆదిలాబాద్ జిల్లా నుండి ప్రారంభించి ఆదిలాబాద్‌తో తనకున్న అనుబంధాన్ని చాటుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులూ లాలా మున్నా, అంకత్ రమేష్, జోగు రవి, వేణుగోపాల్, విజయ్, ఆకుల ప్రవీణ్, దినేష్ మెటోలియ, సోమ రవి, కృష్ణ యాదవ్, మహేందర్, రాజేష్, గొర్ల రాము, దయాకర్, భీమ్‌సేన్ రెడ్డి, రవి రెడ్డి, రాకేష్, సంధ్యారాణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

బేల : మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మాజీ ప్రధాని వాజ్‌పాయ్ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పాయ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రధానిగా వాజ్‌పాయ్ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దత్తా నిక్కం, నాయకులు శివ కుమార్, మోరేశ్వర్, సంజయ్ ఓల్లాప్‌వార్, పోత్‌రాజ్ నవీన్, ప్రదీప్ ఖోడే, జీవన్, రాము బర్కడే పాల్గొన్నారు.

కుభీర్ : మండలకేంద్రంతో పాటు పార్డి(బి), పల్సి, సోనారి, గోడపూర్ తదితర గ్రామాలో సోమవారం బీజేపీ మాజీ ప్రధాన మంత్రి వాజపేయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామంలో ఉన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు వాజపేయి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. నేటి యువత ఆయన అడుగుజాడల్లో నడువాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏశాల దత్తాత్రి, గంగాశేఖర్, బి.సంతోష్, గడ్డం నారాయణ, కనోబ, పోశెట్టి, పోతన్న, గోవర్ధన్, కనకయ్య, నాగేందర్, బీజేపీ కార్యకర్తలు ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు ఆడే గజేందర్, జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వివిధ పార్టీల నుంచి వచ్చి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా మోసపూరిత వాగ్దానాలతో కాలం గడిపిన బీఆర్‌ఎస్‌కి బుద్ధి చెప్పి, కాంగ్రెస్‌లో చేరారు. రాబోవు ఎన్నికల్లో మండలం, తాలూకాలో అన్ని స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్, ఉపాధ్యక్షురాలు దివ్యమాధవ్, ఎంపీటీసీలు సుష్మ రమేష్‌రెడ్డి, గౌరమ్మ వెంకన్న యాదవ్, రమేష్, మాజీ సర్పంచ్ లస్మన్న, మైనార్టీ సెల్ అధ్యక్షులు రఫీక్, ఎస్సీసెల్ అధ్యక్షులు అశోక్, కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, గాజుల సాంబశివ్, దుస నర్సింహులు, ఈశ్వర్‌రెడ్డి, వెంకన్న, గంగాధర్, సంతోష్, పండరి, సల్ల దేవన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

పార్టీ సభ్యత్వానికి కాదు..పదవికి కూడా రాజీనామ చేయాలి

నవతెలంగాణ-జైనథ్

బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వాన్నికి రాజీనామా చేయడం కాదు, డీసీసీబీ చైర్మెన్ పదవికి కూడా రాజీనామా చేయాలని బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గణేష్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గణేష్ యాదవ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జోగు రామన్న పెట్టిన భిక్షతో పదవిని అనుభవిస్తూ కాంగ్రెస్ పార్టీలో చేరడం సిగ్గుచేటన్నారు. నమ్మిన వారిని మోసం చేసే వారిని ప్రజలు ఎప్పుడు క్షమించారన్నారు. ఈ కార్యక్రమంలో జైనథ్ సర్పంచ్ దుమాల దేవన్న, జిల్లా రైతుబంధు సమితి సభ్యుడు జగదీశ్ రెడ్డి, నాయకులు వెంకటరెడ్డి, చిన్న లక్ష్మన్న, లచ్చరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులకు ఘన స్వాగతం



నవతెలంగాణ-లక్ష్మణచాంద

కాంగ్రెస్ ఆవిర్భావ సభకు బయలుదేరిన కాంగ్రెస్ నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్, మహేష్ కుమార్‌గౌడ్‌లకు మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం గంజాల్ టోల్ ప్లాజా దగ్గర ఘనంగా స్వాగతం పలికారు. కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అభిమాన నాయకులను ఘనంగా సత్కారించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వొద్నలా రాజేశ్వర్, ఈటెల శ్రీనివాస్, అట్ల రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయం చూపాలి



ఆందోళన చేస్తున్న తెలంగాణ ఆటో రిక్షా ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణాన్ని స్వాగతిస్తున్నామని, కానీ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న డ్రైవర్ల గురించి ప్రభుత్వం ఆలోచించాలని ఆటో యూనియన్ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా ఆటో వారికి ప్రత్యామ్నుయం చూపాలని కోరుతూ సోమవారం రైల్వే స్టేషన్ ఆటో స్టాండ్ వద్ద ఆందోళన చేపట్టారు. తెలంగాణ ఆటో రిక్షా ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో డ్రైవర్లు పాల్గొని తమను ఆదుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణలో నూతనంగా ఏర్పాడిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం తీసుకువచ్చిన ఉచిత బస్సు ప్రయాణం మంచిదేన్నారు. కానీ ఆటోలపై ఆధారపడి కుటుంబాలు పోషించుకుంటున్న తమ గురించి ఆలోచించడం లేదన్నారు. ఆదిలాబాద్ నుంచి ఆయా గ్రామాలకు ఆటోలను నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నామన్నారు. ఉదయం వచ్చిన వంద రూపాయలు కూడా రావడం లేదన్నారు. దీంతో పిల్లల ఫీజులు, ఇంటి అద్దెతో పాటు ఫైనాన్స్‌పై తీసుకున్న ఆటోకు కిస్తులు కట్టడం కష్టంగా మారిందన్నారు. తమను ఆదుకునేల ప్రభుత్వం ఆలోచనలు చేయాలని, లేనిపక్షంలో కుటుంబ సమేతంగా కలెక్టరేట్ ఎదుట ఆందోళనలు, నిరవధిక దీక్షలు చేపడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు షేక్ నాయిం, ప్రధాన కార్యదర్శి నతురాం, బాబుబాయి, నవీన్, అక్తార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ పర్వదిన వేడుకలు



క్రిస్మస్ సందేశాన్నిస్తున్న బిషప్ ప్రిన్స్ అంటోని

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని క్రైస్తవులు సోమవారం వివిధ చర్చలలో భక్తిశ్రద్ధలతో పండుగను నిర్వహించుకున్నారు. కొత్త బట్టలు ధరించి చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక హోలీ ఫ్యామిలీ క్యాథడ్రల్ చర్చిలో బిషప్ ప్రిన్స్ ఆంటోనీ, క్రిస్మస్ సందేశాన్ని అందించారు. క్రైస్తవులు క్రీస్తుకు సాక్షిగా జీవించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రేమ, ఓర్పు, సహనం, క్షమ అనే సుగుణాలు కలిగి ఉండాలని తెలిపారు. ఏసుక్రీస్తును విశ్వసించే ప్రతి ఒక్కరూ ఇతరులలో క్రీస్తును చూడాలని అన్నారు. అనంతరం కుమురం భీమ్ చౌక్ నుంచి తెలంగాణ చౌక్ వరకు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు చర్చి ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పశువులపాక వద్ద భక్తులు ఫోటోలతో సందడి చేశారు. మోరియా హార్వెస్ట్ చర్చిలో పాస్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ క్రైస్తవులు మారు మనస్సు కలిగి జీవించాలని, అప్పుడే క్రీస్తు అనుచరులుగా పరిగణించబడతారని అన్నారు. క్రిస్మస్ పండుగ క్రైస్తవులకు అతి ముఖ్యమైన పండుగ అని దైవ కుమారుడైన యేసు క్రీస్తు మానవాళి రక్షణ కోసం మనిషిగా ఈ లోకానికి ఏతెంచాడని వివరించారు. క్రిస్మస్ కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం చిన్నారులు చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సీఎస్‌ఐ, బేతేలు, హోలీ మౌంటెన్, ఆరాధన, ఇండియా మిషన్, బేయేర్షాబా, హెబ్రోను చర్చిలలో పాస్టర్లు ఏసుక్రీస్తు లోక రక్షకుడనే క్రిస్మస్ సందేశాన్ని అందజేశారు. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

తాంసి చర్చిలో..



క్రిస్మస్ వేడుకల్లో భాగంగా పాటలు పాడుతున్న క్రైస్తవులు

తాంసి మండలంతో పాటు భీంపూర్ మండలాల్లో క్రిస్మస్ వేడుకలు సోమవారం అంబరాన్నంటాయి. తాంసి మండల కేంద్రంలోని సెయింట్ థామస్ చర్చ్‌లో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని సర్వాంగ సుందరంగా రంగు రంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. చర్చి ఆవరణలో క్రీస్తు జననం గురించిన ప్రతిమలతో ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి ఫాథర్ జోమెన్ ఆధ్వర్యంలో యేసు జన్మదినాన్ని స్వాగతం పలుకుతూ ప్రత్యేక ప్రార్ధనలు చేస్తూ యేసుప్రభును ఆరాధించారు. క్రైస్తవ సోదరులు, చుట్టూ పక్కల గ్రామాల నుంచి వచ్చి చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ కలిసి వచ్చి ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు దివ్యస్థ ప్రసాధమును అందించారు. ఈ సందర్భంగా ఫాథర్ జోమెన్ సమస్త మానవాళి కోసం కృతజ్ఞతా స్తోత్రాన్ని చెల్లించారు. శాంతిని అనుగ్రహించమని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సిస్టర్లు సమిపియా, అమోలియా, కమిటీ సభ్యులు శ్రీకాంత్, మనోజ్, శ్రీవిద్యా పాల్గొన్నారు.

కడెం కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలోని జాయిస్ మిస్ట్రీ చర్చ్‌లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మండల కాంగ్రెస్ నాయకులు హాజరై కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పొద్దుటూరు సతీష్‌రెడ్డి మాట్లాడారు. క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలియజేశారు. యేసు ప్రభు దీవెనలు ఎల్లవేళల అందరిపై ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో చర్చ్ పాస్టర్‌లు సిమన్, చంటి, కాంగ్రెస్ నాయకులు బబ్లు, రహీమ్, సత్యం, చారి, కన్నె శ్రీనివాస్, చాంద్‌పాషా, ధర్మయ్య పాల్గొన్నారు.

సిరికొండలో..

సిరికొండ మండల కేంద్రంలోని బేతెస్థ ప్రార్థన సహవాసం చర్చ్‌లో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి, పాస్టర్ డి.నరేష్ జెకర్యా మహోన్నతమైన యేసు సందేశాలను వినిపించారు. అనంతరం చిన్నారులు, గ్రామ సర్పంచ్ నర్మద పెంటన్నతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ప్రభుత్వం ద్వారా పంపిణీ చేసిన గిఫ్టలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మండలవాసులు పాల్గొన్నారు.



సిరికొండ మండల కేంద్రంలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

- ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్
- రూ.4కోట్లా 19లక్షలతో చేపట్టే బీటీ రోడ్డుకు భూమిపూజ



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్, స్థానిక నాయకులు

నవతెలంగాణ-కుభీర్

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు తన వంతుగా కృషి చేస్తానని ముధోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అన్నారు. సోమవారం మండలంలోని చాత గ్రామం నుంచి విరేగాం గ్రామం వరకు రూ.4కోట్లా 19 లక్షలతో ఎంఆర్‌ఆర్ నిధులతో బీటీ రోడ్లుకు నిధులు మంజూరు కావడంతో మండల బీజేపీ నాయకులతో కలిసి వాటి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఉన్న అన్ని గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండి వారికి సేవలందించేందుకు కృషి చేస్తామని అన్నారు. అదే విధంగా మండలంలో నన్ను భారీ మెజార్టీతో గెలిపించిన వారికి ఎలాంటి ఇబ్బంది రాకుండా అన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు. దీంతో గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. అనంతరం చాత గ్రామంలో అటల్ బీహార్ వాజపేయి జయంతి వేడుకలో పాల్గొని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన సందర్భంగా మొదటి సరిగా మా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు సర్పంచ్ అనిల్ గ్రామస్తులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అనురాధ అనిల్, సాయన్న, సౌంలి రమేష్, మండల నాయకులు గులాబ్, సాయినాథ్ వెంకట్‌రావు పటేల్, కనకయ్య, నాగేందర్, వి.మోహన్ పైడిపెల్లి గంగాధర్, బి.సంతోష్, కనోబ, నారాయణ్, పంచాయతీ రాజ్ డీఈ సురేష్, జేఈ సూర్యతేజ కాంట్రాక్టర్ మండల నాయకులు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఐ పోరాటాల ఫలితంగానే పేదలకు ఇండ్ల స్థలాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీపీఐ పోరాటల ఫలితంగా పేదలకు ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు అందాయని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. సోమవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా కేఆర్కే కాలనీలో జెండాను ఆవిష్కరించారు. పార్టీకి అనుకూల నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పోరాటలు నిర్వహించి పార్టీ పరంగా 5 వేల మందికి కేఆర్కే కాలనీలో ఇళ్ల స్థలాలు ఇప్పించామన్నారు. పదేండ్ల బీఆర్‌ఎస్ మోసపూరిత పాలనతో ప్రజలు విసుగు చెంది సీపీఐ, కాంగ్రెస్ కూటమిని గెలిపించాయన్నారు. పేదల సంక్షేమమం పార్టీ, ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అరుణ్ కుమార్, గంగాధర్, గంగమ్మ, నరసయ్య, బాలయ్య, రమణ పాల్గొన్నారు.

జైనథ్ : మండల కేంద్రంలో సీపీఐ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పందేడ్ల బీజేపీ, బీఆర్‌ఎస్ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, షేక్ బాషా, అరుణ్ కుమార్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కండెల గణేష్, షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

తలమడుగు : సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకోని మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో పార్టీ కార్యదర్శి మాచర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ పేద ప్రజల కొరకు ఎంతో పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చిలుక దేవిదాస్, సంతోష్, నాగరాజు, జంగు పాల్గొన్నారు.

ఎంఐఎం జాతీయ అధ్యక్షుడిని కలిసి మాజీ కౌన్సిలర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎంఐఎం జాతీయ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీలను మాజీ కౌన్సిలర్ నిమ్మల అశోక్, పార్టీ సంయుక్త కార్యదర్శి షకీల్ అహ్మద్, ఎండీ సుబహాన్ మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం హైదరాబాద్‌లోని దారుసలంలో కలిసిన నాయకులు వారికి అంబేద్కర్ చిత్రపటాన్ని బహుకరించారు. అనంతరం జిల్లాలోని రాజకీయ పరిస్థితులను అసదుద్దీన్ ఓవైసీకి వివరించారు. త్వరలో జిల్లాలో పార్టీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం చేపడుతున్నామని వివరించగా ఓవైసీ అభినందించినట్టు వారు పేర్కొన్నారు.

మంథనం ఒక సంకల్పం ఆధ్వర్యంలో తీర్థ ప్రదేశాలపై ఎగ్జిబిషన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

శబరిమలలోని తీర్థ ప్రదేశాల గురించి ప్రజలకు తెలియజేసేలా ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. సోమవారం మంథనం ఒక సంకల్పం ఆధ్వర్యంలో అనిల్ దేశ్ పాండే నేతృత్వంలో అయ్యప్ప ఫోటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గోపాల కష్ణ మఠాధిపతి యోగనంద సరస్వతితో ఎమ్మెల్యే పాయల్ శంకర్ పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం మఠాధిపతితో పాటు ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను అనేక సార్లు శబరిమలకు వెళ్లిన అనిల్ దేశ్పాండే ప్రదర్శించిన ఫోటో ఎగ్జిబిషన్‌లలోని చాలా ప్రదేశాలు చూడలేదన్నారు. సాక్షాత్తు శబరిమలను చూస్తున్నట్టు ఉందన్నారు. ప్రదేశాల ఫోటోలు, వాటి గురించి క్లుప్తంగా ఆయన వివరించిన తీరు అభినందనీయమన్నారు. దీని వెనుక ఆయన పడ్డ కష్టం వివరించలేదనిదన్నారు. ఈ కార్యక్రమంలో మంథనం ఒక సంకల్పం నిర్వాహకులు నిశికాంత్ దేశ్పాండే, అల్లూరి సంజీవ్ రెడ్డి, బీజేపీ నాయకులు ఆకూల ప్రవీణ్ పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని కౌట్ల(బి) గ్రామంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి సోమవారం నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి హాజరై పెద్దమ్మ తల్లిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యేకు ముదిరాజ్ సంఘ సభ్యులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ను శాలువాతో సన్మానించారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షులు కరిపే విలాస్, నాయకులు చంద్ర ప్రకాష్‌గౌడ్, మంతెన గంగారెడ్డి, సాహెబ్‌రావు, సామల వీరయ్య, రాజలింగం, చాణక్య, నవీన్ తోపాటు ముదిరాజ్ సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శాంతియుత జీవనం కోసం సువార్త సందేశం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలో క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని వెస్లీ చర్చ్, బేతని చర్చ్, నిస్సి మినిస్ట్రీస్ చర్చిల్లో క్రిస్మస్ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించుకున్నారు. అనంతరం సువార్తలను అందజేసి, శాంతియుత జీవనంపై సందేశాన్ని ఇచ్చారు. ఈ వేడుకల్లో ఆయా గ్రామాల క్రీస్తు అనుచరులు పాల్గొన్నారు.

కుక్క దాడిలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-బెజ్జూరు



మండలంలోని కుకుడ గ్రామానికి చెందిన సడ్మెత సుక్కుబాయి అనే వృద్ధురాలిపై సోమవారం పిచ్చికుక్క దాడిచేయడంతో తీవ్ర గాయాలపాలైంది. చేనులో పత్తి ఏరడానికి కోర్తగూడ గ్రామ సమీపంలో గల చేనుకు వెళుతున్న క్రమంలో ఒక్కసారిగా కుక్క దాడి చేసి గాయపరిచినట్టు బాధితురాలి తెలిపింది. కుక్కల బెడద తీవ్రమైందని, ఇప్పటికే పలువురిని కుక్కలు కరిచాయని బాధితురాలు తెలిపింది. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో కాగజ్‌నగర్‌కు తరలించారు.

ఎమ్మెల్యేకు సన్మానం

నవతెలంగాణ-వాంకిడి



ఆసిఫాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన కోవలక్ష్మిని సోమవారం సింగిల్‌విండో చైర్మన్ జాబిరె పెంటు, సరండి సర్పంచ్ కమలాకర్, సింగిల్‌విండో డైరెక్టర్ గొల్ల, బీఆర్ఎస్ నాయకులు బాపురావు ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే కోవలక్ష్మికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు

ప్రత్యామ్నాయ రోడ్డుకు మరమ్మత్తులు



నవతెలంగాణ-జైపూర్

ఇందారం మీదుగా నిర్మించిన రాజీవ్ రహదారి ఫ్లై ఓవర్ నుంచి రామారావుపేట్ వరకు నిర్మించిన ప్రత్యామ్నయ రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టేందుకు సింగరేణి యాజమాన్యం ముందుకొచ్చింది. సోమవారం స్థానిక సర్పంచ్ నామాల సత్యవతి తిరుపతితో కలిసి సింగరేణి అధికారులు ఫ్లై ఓవర్ నుంచి రామారావుపేట్ వరకు గల ప్రత్యామ్నయ రోడ్డును పరిశీలించారు. వర్షా కాలంలో కురిసిన భారీ వర్షాలతో ఈ రోడ్డు మధ్యలో గల కల్వర్టులు కూలిపోవడంతో వాహణాల రాకపోకలు నిల్చిపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై స్థానిక సర్పంచ్‌తో పాటు స్థానికులు శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డిని కలిసి రోడ్డు ఇబ్బందులు వివరించడంతో అధికారులు స్పందించినట్లు సర్పంచ్ సత్యవతి తెలిపారు. ఇందారం బస్టాండ్ నుంచి చెరువు కట్ట మీదుగా రామారావుపేట్ వరకు నిర్మించిన రోడ్డుకు ప్రత్యామ్నయంగా రామారావుపేట్ గ్రామస్థుల సౌకర్యార్థం రైల్వే ట్రాక్ మీదుగా రామారావుపేట్ వరకు రోడ్డు నిర్మించడం జరిగింది. ఈ మేరకు సింగరేణి పీఓ పురుషోత్తంరెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ సుధీర్ జక్కుల వార్ రోడ్డును సంధర్శించి వెనువెంటనే మరమ్మత్తు పనులకు ఆదేశించినట్లు సర్పంచ్ నామాల సత్యవతి తిరుపతి తెలిపారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-కాసిపేట

సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ భరోసా ఇచ్చారు. సోమవారం మందమర్రి ఏరియాలోని కాసిపేట 1వ గని, 2 ఇంక్లైన్‌లో ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఐఎన్టీయూసీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆయన ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ సింగరేణి కార్మికుల హక్కులు అమలు చేయిస్తామని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచుతామని హామీ ఇచ్చారు. ప్రతి కార్మికుడు ఐఎన్టీయూసీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సిద్ధం శెట్టి రాజమౌళి, సెంట్రల్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ దేవి భూమయ్య, సెంట్రల్ సెక్రటరీ రాపర్తి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ కారుకూరి రాంచందర్, మాజీ జడ్పీటీసీ రౌత్ సత్తయ్య, పిట్ సెక్రటరీ రవీందర్, సామల లక్ష్మణ్, నస్పూర్ నర్సింగ్, సిద్ధం తిరుపతి, మాసు సుధాకర్ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలి : ఏసీపీ



నవతెలంగాణ-కాసిపేట

ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి పోలీసు సేవలు అందించాలని బెల్లంపల్లి ఏసీపీ సదయ్య పోలీస్ సిబ్బందికి సూచించారు. సోమవారం మండలంలోని దేవాపూర్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీలలో భాగంగా పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధులను ఎస్సై ఆంజనేయులు వివరించారు. అనంతరం ఏసీపీ సదయ్య మాట్లాడుతూ విధుల పట్ల అంకితభావంగా ఉండాలని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. న్యాయ బద్ధంగా చట్టాన్ని అమలు చేయడం పోలీసుల బాధ్యత అని ముందుగా చట్టాలను స్వయంగా పాటిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలవాలన్నారు. దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిదిలో అనుమానిత వ్యక్తులు ఎప్పుడు కనిపించినా వెంటనే తనిఖీ చేయాలని సూచించారు. పెట్టి కేసులకు కోర్టు ద్వారా పర్మిషన్ పొందిన తర్వాత చార్జిషీట్ దాఖలు చేయాలని అన్నారు, అక్రమ మార్గంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు పాల్పడకుండా పటిష్టంగా పెట్రోలింగ్ నిర్వహించాలని పేర్కొన్నారు. నకిలీ విత్తనాలపై గట్టి నిఘా ఉంచాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించి ప్రమాదాల నివారించడానికి కృషి చేయాలని సూచించారు. ఆర్థిక నేరాలకు కట్టడి చేయడానికి సీసీ టీవీ కెమెరాలు అమర్చే విధంగా ప్రజలకు చైతన్య పరచాలి అని పేర్కొన్నారు. ప్రజలు ఎటువంటి సమాచారమైనా డయల్ 100 ద్వారా తెలుపవచ్చు అని సూచించారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాల తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. రాత్రి పెట్రోలింగ్ చేయాలని, పాత నేరస్తులను ఎప్పటికప్పుడు విచారించాలని అన్నారు. సైబర్ నేరాల నియంత్రణ గురించి గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని ప్రజాలైఫ్‌కేర్ ఆస్పత్రిలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ప్రజాబంధు ఫౌండేషన్ అధ్యక్షులు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు తెలిపారు. కంటి చూపు మందగించిన వారు, కంటి శుక్లాలు ఉన్నవారు ఈ శిబిరానికి వచ్చి ఉచితంగా చికిత్సలు చేయించుకోవచ్చని, అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు కూడా చేయించనున్నట్లు ఆయన తెలిపారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆపన్న హస్తం

- ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు అందజేసిన సీఐ, ఎస్సై

నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని ఖైరి గ్రామంలో అగ్నిప్రమాదం సంభవించి మూడు ఇండ్లు పూర్తిగా కాలిపోయిన విషయం తెలిసిందే. బాదిత కుటుంబాలను ఆదుకునేందుకు గ్రామాల వారీగా ప్రజలు ముందుకు వస్తున్నారు. అగ్నిప్రమాదంతో సర్వం కోల్పోయిన బాధితులకు మనోధైర్యం కల్పిస్తూ తామున్నమనే భరోసాను అందిస్తున్నారు. గ్రామాల ప్రజలతో పాటు పోలీసులు కూడా ముందుకు వచ్చి సాయం చేయడంపై హర్షం వ్యక్త చేస్తున్నారు. వాంకిడి సీఐ శ్రీనివాస్, కెరమెరి ఎస్సై విజయ్ కుమార్ ఆధ్వర్యంలో రూ. ఐదు వేల ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు. ఖైరి సర్పంచ్ లెన్గూరే విజయలక్ష్మి బాలాజీ రూ.16వేలు, ఖైరి రూ.40 వేల550, ఇంద్రనగర్ రూ.17వేల మొత్తం గ్రామాలు కలిపి రూ.73550 సర్పంచ్‌తో పాటు గ్రామ పెద్దలు బాదిత కుటుంబాలకు అందజేశారు. కాంగ్రెస్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ ఎండీ మునీర్ అహ్మద్ ప్రభుత్వం ద్వారా అన్ని రకాల సహకారం అందజేస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా కేలీబీ గ్రామానికి చెందిన యువజన సంఘం ఆధ్వర్యంలో రూ.18 వేల 200 అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బిక్కు, బుదాజీ, శివరాం, బాపూజీ, విశ్వనాథ్, సోంనాథ్, అంబాజీ, పోచయ్య, తులసిరాం పాల్గొన్నారు.



బియ్యం, ఆర్థిక సాయం అందించిన పోలీసులు

బాదిత కుటుంబాలకు పోలీసులు అగ్ని ప్రమాద బాధితులకు పోలీసులు-మీకోసం కార్యక్రమంలో భాగంగా 75 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు, రూ.5000 ఆర్థిక సాయం అందజేశారు. దాతలు సైతం బాధితులకు సాయం చేయాలని పోలీసులు కోరారు. ఈ కార్యక్రమంలో వాంకిడి సీఐ బి.శ్రీనివాస్, కెరమెరి ఎస్సై గుంపుల విజయ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



దహెగాంలో..

నవతెలంగాణ-వాంకిడి

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం మండలకేంద్రంలోని చర్చీలలో క్రైస్తవులు ప్రార్థనలు చేవారు. అందరు సుఖసంతోషాలతో ఉండాలని చర్చి పాస్టర్ ప్రభాకర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జడ్పీటీసీ, బీఆర్ఎస్ అధ్యక్షుడు అజయ్‌కుమార్‌కు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అలాగే మండలంలోని గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దహెగాం : మండలకేంద్రంతో పాటు మండలంలోని చిన్నరాస్పెల్లి, పెసరుగుంట, కొత్మీర్, చంద్రపెల్లి తదితర గ్రామాల్లోని చర్చీల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు తినిపించుకున్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నూతి అభిలాష్‌కు జాతీయ స్థాయి స్ఫూర్తి శిఖరం అవార్డు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని వాంకిడి మండలానికి చెందిన ఉపాధ్యాయుడు డా.నూతి అభిలాష్ కు జాతీయ స్థాయి స్ఫూర్తి శిఖరం అవార్డ్ సొంతం చేసుకున్నాడు. అంతర్జాతీయ గుర్తింపు పొందిన సాహితీ సామాజిక సేవా సంస్థ ఆర్యాణీ సకలకళా వేదిక, శ్రీ గౌతమేశ్వర సాహితీ కళా సేవా సంస్థ సంయుక్తంగా ఫిలిం భవన్, కరీంనగర్ వేదికగా జరిగిన కార్యక్రమంలో జాతీయ స్థాయి స్ఫూర్తి శిఖరం అవార్డ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్యానీ, గౌతమేశ్వర సంస్థల అధ్యక్షుడు దూడపాక శ్రీధర్ మాట్లాడుతూ విద్యరంగంలో రెండు ప్రపంచ రికార్డులను పొందిన నూతి అభిలాష్ విద్యా రంగంలో, ఉపాధ్యాయ రంగంలో సాహితీ, సామాజిక రంగంలో చూపిన ప్రతిభకు, కృషికి సేవలకు గుర్తింపుగా ప్రోత్సాహకంగా ఈ జాతీయ స్థాయి అవార్డును ప్రధానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డా.నూతి అభిలాష్ మాట్లాడుతూ మున్ముందు కూడా విద్యా సాహితీ సామాజిక రంగాలలో తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని అన్నారు. తన సేవను గుర్తించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి రచయిత విమర్శకులు, భవానీ సాహిత్య వేదిక అధ్యక్షుడు డా. వైరాగ్యం ప్రభాకర్, స్త్రీ కంఠ గాయకులు గిన్నిస్ బుక్ హోల్డర్ డా.సుబ్రమణ్య దీక్షితులు, ప్రముఖ రంగస్థల నటులు కుమారి బీఎస్.కృష్ణకుమారి, ప్రముఖ పర్యావరణ వేత్త పిట్టల రవిబాబు, ప్రముఖ కవి పోర్ల వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాల పోచమ్మ జాతర



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని పాతసార్సాల గ్రామ శివారులోగల ముత్యాల పోచమ్మ ఆలయ ఆవరణలో సోమవారం బోనాల జాతర ఘనంగా సాగింది. కాగజ్‌నగర్, భీమిని, పెంచికల్‌పేట్, దహెగాం మండలాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చారు. ఉదయం 8 గంటల నుంచే భక్తులు హాజరయ్యారు. పాతసార్సాల, రాస్పెల్లి పరిసరాల్లోని భక్తజనం ఎడ్లబండ్లతో తరలివచ్చారు. బోనాలు వండిన అనంతరం బోనమెత్తుకుని మహిళలు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా శివసత్తుల పూనకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ జాతరకు సార్సాల సర్పంచి పుల్ల అశోక్ తన సొంత నిధులతో ఆలయానికి వెళ్లడానికి తాత్కాలిక రోడ్డుతో పాటూ ఇతర ఏర్పాట్లు చేశారు. మండలంలోని నాగంపేట్, రాస్పెల్లి, సార్సాల గ్రామాలకు చెందిన పలువురు బీఎస్పీ నాయకులు భక్తులకు పండ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు మౌల్కార్ చంద్రశేఖర్, చల్లూరి విజయ్, గోలేటి నాని, గంగారాం, జంబుల కార్తీక్ పాల్గొన్నారు.

ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ

నవతెలంగాణ-కెరమెరి

ప్రేరణ ఫౌండేషన్, సహృదయ ఫౌండేషన్(యూఎస్ఏ) సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని చిన్నుగూడ గ్రామాల్లోని పేద గిరిజనులకు దుప్పట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రేరణ ఫౌండేషన్ చైర్మన్ శరత్ సుదర్శి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రెండు తెలుగు రాష్ట్రాల్లో పేద గిరిజనులకు దుప్పట్లు పంచడం, పేద విద్యార్థులకు ఉచిత ట్యూషన్లు చెప్పించడం, నోట్ బుక్కులు, పెన్నులు, పెన్సిల్లు ఇచ్చి సహకారం అందిస్తున్నామని తెలిపారు. అనేక ప్రాంతాల్లో చలికి తట్టుకోలేక మరణిస్తున్నారన్నారు. అలాంటి వారికి ఏదోరకంగా సహయపడాలనే ఆలోచనతో దాతల సహకారంతో దుప్పట్లు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమానికి సహకారం అందించిన సహృదయ ఫౌండేషన్(యూఎస్ఏ) వ్యవస్థాపకురాలు బిందు తాడావాక కు ధన్యవాదాలు తెలియజేశారు. పేదలను మరింతగా ఆదుకోవడం కోసం ఇటువంటి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సామాజిక కార్యకర్త మహేష్ దుర్గే మాట్లాడుతూ ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు ఉచిత ట్యూషన్లు చెప్పించడం, పెన్నులు, పెన్సిల్లు పంపిణీ చేయడం జరుగుతోందని తెలిపారు. నిరుద్యోగ మహిళలకు కుట్టు మిషను, విస్తరణకుల తయారీ వంటి ట్రైనింగ్‌లు ఇప్పిస్తున్నామని తెలిపారు. ఇలాంటి మంచి సేవాకార్యక్రమాలకు ఆర్థికంగా సంహరించే దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహాత్మే భీంరావు పాల్గొన్నారు.



గిరిజనులకు దుప్పట్ల పంపిణీ చేస్తున్న ప్రేరణ ఫౌండేషన్ సభ్యులు

కార్మిక హక్కుల సాధనకు ఏఐటీయూసీని గెలిపించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు కలవేణి శంకర్



నవతెలంగాణ-కాసిపేట

పోరాడి హక్కులు సాధించి ప్రాణత్యాగాలు చేసిన, కార్మికుల పక్షాన ఉండే ఏఐటీయూసీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణి శంకర్ కార్మికులకు పిలుపు నిచ్చారు. సోమవారం కాసిపేట గనిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల హక్కులను సాధించే ఏఐటీయూసీకే మద్దతు తెలుపాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, నియోజకవర్గ ఇంచార్జ్ రేగుంట చంద్రశేఖర్, బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్, బ్రాంచ్ ఉపాధ్యాక్షుడు బియ్యాల వెంకటస్వామి, నాయకులు నాగేశ్వర్‌రావు, రాజేందర్, చొప్పరి శ్రీహరి, బొద్దుల వెంకటేశ్, లింగయ్య, సంపత్, మహేశ్, ఆడెపు రవీందర్, అనీల్ పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనకు బీఎంఎస్‌కు అవకాశం ఇవ్వండి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

నవతెలంగాణ-రెబ్బెన

హక్కుల సాధనకై బీఎంఎస్‌కు అవకాశం ఇవ్వాలని సింగరేణి కార్మికులను ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు కోరారు. మండలంలోని గోలేటిలో సింగరేణి వర్క్‌షాప్, ఖైరిగూడ ఓపెన్‌కాస్ట్ గనుల్లో పనిచేసే కార్మికులతో సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు, బీఎంఎస్, భారతీయ జనతా పార్టీ అండగా ఉంటాయని, వారి ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తాయని తెలిపారు. ఇన్‌కమ్‌ట్యాక్స్, రియింబర్స్‌మెంట్, కేంద్ర విద్యాలయాలు, సింగరేణి కార్మికుల హక్కుల సాధన కోసం బీఎంఎస్‌కు అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో పార్టీ అనుబంధ ట్రేడ్ యూనియన్ బీఎంఎస్ కాకడ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆజ్మీర ఆత్మారాం నాయక్, ఆసిఫాబాద్ అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, కుమురం భీం జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు గుల్బం చక్రపాణి, అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్, కొలిపాక కిరణ్, నవీన్‌గౌడ్, సుదర్శన్ గౌడ్ పాల్గొన్నారు.



వాజ్‌పేయి జయంతి వేడుకలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని సోమవారం కాగజ్‌నగర్‌లో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, నాయకులు ఈర్ల విశ్వేశ్వర్‌రావు, చన్నపురి గణపతి, అరుణ్ లోయ, రాణి, తొగరి పోచం, వలపదాసు రమేష్, చేరాల శ్రీనివాస్, చిప్పకుర్తి శ్రీనివాస్, దెబ్బటి శ్రీనివాస్, రవికాంత్, కొండు తిరుపతి, నికోడె అర్జున్ పాల్గొన్నారు.

కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలి



నవతెలంగాణ-దహెగాం

కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. సోమవారం మండలకేంద్రంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓడి పోయామని నిరాశ పడడం కంటే స్థానిక సంస్థల్లో గెలుపు కోసం కృషి చేయాలన్నారు. సమస్యలపైన పోరాటం చేస్తూ ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తాళ్లపెల్లి శ్రీరామారావు, ఆత్మా చైర్మన్ కొమురాగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు సంతోష్‌గౌడ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బండ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
మంగళవారం | డిసెంబర్ 26, 2023 | www.navatelangana.com

చందనాపూర్ సర్పంచ్ ఏఐటీయూసీలో చేరిక

నవతెలంగాణ-గోదావరిఖని

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా సోమవారం జీడికే 11వ ఇంక్లైన్ లో జరిగిన ఎన్నికల ప్రచారంలో భాగంగా జీడికే 11వ ఇంక్లైన్‌లో పనిచేస్తున్న చందనాపూర్ సర్పంచ్ శంకర్, రిలె సి ఓవర్మెన్ శ్రీనివాస్ ఏఐటియుసిలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి యూనియన్‌లోకి యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం ఆహ్వానించారు. యూనియన్‌లో చేరిన వారికి నాయకులు అభినందనలు తెలిపారు. సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం, కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఏఐటియుసిని ఈనెల 27న జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల్లో నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటియుసి పిట్ సెక్రటరీ ఎం.సంపత్, నాయకులు చక్రపాణి, సిద్దమల్ల రాజు, గొడిశల నరేష్, ఆరెల్లి రాజేశ్వరరావు, చెప్యాల భాస్కర్, కిరణ్, రంజిత్, రమేష్, బాలు, ఏవిఎస్ ప్రకాశ్, ఇనుముల రాజమౌళి, నాయిని శంకర్, అంబటి శ్రీను, కళ్యాణ్, సంత్, వంశీ తదితరులున్నారు.

గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీని గెలిపించండి

నవతెలంగాణ-గోదావరిఖని

సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా సోమవారం సింగరేణి ఆర్జీ 1 ఏరియాలోని జీడికే 11వ ఇంక్లైన్, సిఎస్‌పి 1, సివిల్ డిపార్ట్మెంట్, ఏరియా హాస్పిటల్, జీఎం ఆఫీసులలో ఏఐటియుసి ఆర్జీ 1 ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమం లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషంలు పాల్గొని ప్రసంగించారు. సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం, కార్మికుల హక్కుల కోసం కృషి చేస్తున్న ఏఐటియుసిని ఈ నెల 27న జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల్లో నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రంగు శ్రీనివాస్, మాదన మహేష్, ఎస్.వెంకట్ రెడ్డి, మెరుగు రాజయ్య, బండి మల్లేశ్, గుర్రం ప్రభుదాస్, ఏలేశ్వరం సత్యనారాయణ, నాయిని శంకర్, బుర్ర భాస్కర్, చెప్యాల భాస్కర్, గొడిశల నరేశ్, సిద్దమల్ల రాజు, కే.శ్రీనివాస రావు తదితరులున్నారు.

ఏఐటీయూసీకి ఓటు వేస్తే ప్రయివేటీకరణ



మాట్లాడుతున్న సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి గోదారి భాగ్యరాజు

నవతెలంగాణ-నస్పూర్

డిసెంబర్ 27న జరిగే సింగరేణి గుర్తింపు ఎన్నికలలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ)కి ఓటు వేస్తే మరలా ప్రయివేటీకరణకు, పైరవీలకు అవకాశం ఇచ్చినట్లేనని కార్మికులు ఆలోచించి ఓటు వేయాల్సిందిగా సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి గోదారి భాగ్యరాజు అన్నారు. సోమవారం శ్రీరాంపూర్‌లోని కార్యాలయంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్‌తో కలిసి వారు మాట్లాడుతూ ఏఐటీయూసీ మూడుసార్లు గుర్తింపు సంఘంగా, రెండుసార్లు ప్రాతినిధ్య సంఘాలుగా గెలిపించినా కూడా కార్మికులకు కనీస హక్కులు సాధించలేకపోయారని ఆరోపించారు. ఏఐటీయూసీ గెలిస్తే మెడికల్ దందా పైరవీలకు, యాజమాన్యంతో కలిసి సంస్థ ప్రయివేటీకరణకు తోడ్పడుతారే తప్ప కార్మికులకు ఎలాంటి హక్కులు సాధించరని అన్నారు. గతంలో యాజమాన్యంతో కలిసి వారసత్వ ఉద్యోగాలు రద్దు చేయించారని, ఉద్యోగానికి బదులు 24 నెలల జీతం గాని, రూ.2 లక్షలు గాని ఇవ్వాలని అగ్రిమెంట్ చేసుకున్నట్లు పేర్కొన్నారు. 2011 నుంచి 12 వరకు సింగరేణిలో గెలిచి కూడా పెర్క్స్ పై ఇన్కమ్ టాక్స్‌ను కోల్ ఇండియా వలె, సింగరేణిలో సాధించలేదని, ప్రస్తుతం గెలిపిస్తే సాధిస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కోయగూడెంలో సర్ఫేస్ మైనర్‌కు వ్యతిరేకంగా 17 రోజులు సమ్మె చేస్తే, తప్పుడు అగ్రిమెంట్ చేసినప్పుడు కంపెనీకి తిరుగులేని అధికారంగా కల్పిస్తూ సర్ఫేస్ మైనర్ను పర్మిషన్ ఇచ్చేటట్లు అగ్రిమెంట్ చేసి ప్రయివేటీకరణకు బీజం వేశారన్నారు. కార్మికులను డిస్మిస్ చేసినా కూడా ఏఐటీయూసీ నాయకులు పట్టించుకోలేదని, ప్రమోషన్లు, క్యాడర్ స్కీమ్‌లు సింగరేణిలో అమలు చేయించడంలో విఫలమయ్యారన్నారు. ప్రస్తుతం కార్మికులకు సొంతింటి కల కోసం సీఐటీయూ గత సంవత్సర కాలంగా పోరాటం చేస్తుంటే, ఏఐటీయూసీ నాయకులు దానిని అమలు చేస్తాననడం విడ్డురంగా ఉందన్నారు. కార్మికులు తమ కష్ట నష్టాల్లో తోడుండి, వారికి కావాల్సిన హక్కులు సాధించే వారికి ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్, చంద్రశేఖర్, శ్రీనివాస్, అజయ్ పాల్గొన్నారు.

మంత్రులకు వినతుల వెల్లువ



నవతెలంగాణ- ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లాకు వచ్చిన రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లను వివిధ సంఘాల నాయకులు వినతిపత్రాలు అందించారు. పట్టణ శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కాంగ్రెస్ సన్నాహక సమావేశానికి హాజరైన మంత్రులకు తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు వివిధ సమస్యలు విన్నవించారు. ఓపీఎస్‌లను పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్-4లుగా మార్చి రెగ్యూలర్ చేయాలని, ఓపీఎస్ వ్యవస్థను రద్దు చేయాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు. వీరితో పాటు సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. సమ్మెకాలంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన క్రమబద్ధీకరణ చేస్తామని చెప్పిన హామీలను నెరవేర్చాలని కోరారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి, జిల్లా అధ్యక్షుడు పడాల రవీందర్, ఆర్.ప్రకాష్, వెంకటి, చిరంజీవి, దేవదర్శన్ తదితరులు పాల్గొన్నారు.


మంత్రికి టీఎన్‌జీఓ సంఘం నాయకులు

రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును తెలంగాణ నాన్ గజిటెడ్ అధికారుల సంఘం(టీఎన్‌జీఓ) నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం ఆదిలాబాద్‌కు వచ్చిన మంత్రికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు సంద అశోక్, ప్రధాన కార్యదర్శి ఏ.నవీన్‌కుమార్, సభ్యులు తిరుమల్‌రెడ్డి, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-ముత్తారం

నవతెలంగాణ కథనానికి స్పందన లభించింది. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ ఎదురుగా మండల విద్యుత్ అధికారి నివాసముంటున్న ఇంటి ముందు 11 కెవి విద్యుత్ స్థంబానికి నిలువెత్తుగా తీగ అల్లుకొని ప్రమాదకరంగా మారడంతో నవతెలంగాణలో కథనం ప్రచురించడం జరిగింది. దీంతో స్పందించిన విద్యుత్ అధికారి తన ఇంటి ముందే ఉన్న విద్యుత్ పోల్‌కు అలుముకున్న తీగను విద్యుత్ సిబ్బందిచే తొలగించారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ-ముత్తారం

ముత్తారం మండలంలోని చర్చిల్లో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా క్రైస్తవ సోదర, సోదరీమణులు ఉదయానే చర్చిల్లోకి చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌లు కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమాల్లో పాస్టర్ చెరుకు సుదర్శన్, సంఘస్తులు నరహరి, అనిల్ రెడ్డి, ఇనుముల శ్రీనివాస్, అంబటి చంద్రమౌళి, రొడ్డ శ్రావణ్, రొయ్యల రాజ్‌కుమార్, గుండ విజయ్ కుమార్, అన్నం పద్మ కోడి సౌజన్య తదితరులున్నారు.

టీబీజీకేఎస్‌కు ఓటు వేసి గెలిపించండి

నవతెలంగాణ-గోదావరిఖని

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) ఓటు వేసి గెలిపించాలని యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎండీ జాహిద్‌పాషా అన్నారు. సోమవారం గోదావరిఖనిలోని టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎండీ.జాహిద్ పాషా మాట్లాడారు. కేసీఆర్ హయాంలోనే సింగరేణి సంస్థ ప్రయోజనాలు, కార్మిక సంక్షేమం భారీగా జరిగిందన్నారు. సింగరేణి సంస్థ ఎదుగుదలకు, సంస్థను లాభాల బాటా పట్టించేందుకు, కార్మికుల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం ఎనలేని కృషి చేసిందని ఆయన గుర్తు చేశారు. కార్మికుల గొంతుకగా నిలిచిన టీబీజీకేఎస్‌ను గెలిపించాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ హయాంలో కారుణ్య నియామకాల పేర 16వేల మందికి డిపెండెంట్ ఉద్యోగాలు ఇచ్చి కోల్‌బెల్ట్ ప్రాంతంలో యువతకు ఉపాధి కల్పించింది తెలంగాణ ప్రభుత్వం అన్నారు. డిపెండెంట్ ఉద్యోగం వద్దనుకుంటే ఆ కుటుంబానికి రూ.25లక్షలు చెల్లించాలన్న ఉదారమైన నిర్ణయాన్ని కేసీఆర్ తీసుకున్నారని పేర్కొన్నారు. కోల్ ఇండియాలో లేని విధంగా కారుణ్య నియామకాల ద్వారా సింగరేణిలో మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత కూడా కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సంస్థ నికర లాభాల్లో కార్మికులకు భారీ మొత్తంలో వాటాను పంచామని, తెలంగాణ ఏర్పడిన నాటికి లాభాల వాటా10శాతం ఉంటే దానిని 32శాతానికి పెంచామన్నారు. కార్మికుల తల్లిదండ్రులకు కార్పొరేట్ ఆసుపత్రిలో ఉచిత వైద్యం, సొంత ఇల్లు నిర్మించుకునే వారికి రూ.10లక్షల వడ్డీ లేని రుణం, ఐఐటీ, ఐఐఎం వంటి సంస్థ చదువుకునే కార్మికుల పిల్లలకు ఫీజు రియాంబర్స్‌మెంట్ అమలు చేయడం లాంటి ఎన్నో విప్లవాత్మక కార్మిక సంక్షేమ నిర్ణయాలు కేసీఆర్ హయాంలోనే జరిగాయన్నారు. కార్మికులకు గతంలో ఎన్నడూ లేని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి సింగరేణిని కష్టాల నుంచి కాపాడినబీఆర్ఎస్ అనుబంధ సంఘం టీబీజీకేఎస్‌ను ఈ ఎన్నికల్లో గెలిపించాలని జాహిద్ పాషా కోరారు. సంఘ నాయకత్వ బాధ్యతల్లో యువతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. గత పదేళ్ల కాలంలో ఒక్క సమ్మె కూడా చేయనవసరం లేకుండా అన్నీ పనులను, డిమాండ్లను టీబీజీకేఎస్ సాధించిందని జాహిద్‌పాషా గుర్తు చేశారు. ఈ సమావేశంలో యూనియన్ ఆర్జీ 1 ఉపాధ్యక్షులు గండ్ర దామోదర్‌రావు, నాయకులు వడ్డేపల్లి శంకర్, లావుడ్య వెంకటేష్, చెల్పూరి సతీష్ శేషగిరి, పొలాడి శ్రీనివాసరావు, మల్లయ్య, చెలుకలపెల్లి శ్రీనివాస్, మల్లారెడ్డి తదితరులున్నారు.

పోలీసులు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించాలి

- డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్

నవతెలంగాణ-జన్నారం



జిల్లాలో జరిగే నేరాలను అరికట్టడానికి పకడ్బందీ చర్యలు చేపట్టడంతో పాటు నేరస్థులను పట్టుకోవడం, ఇన్వెస్టిగేషన్‌లో సీసీటీవీ, కెమెరాల ఫుటేజీ, టెక్నికల్ ఆధారాలు సేకరించాలని, అలాగే ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించాలని మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ అ న్నారు. సోమవారం ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ రోజుకు కనీసం 15 నిమిషాల పాటు పోలీస్‌స్టేషన్ పరిధిలో గల ప్రజల మధ్య తిరుగు తూ వారి సమస్యలను తెలుసుకోవాలన్నారు. అదే విధంగా సివిల్ విభాగాల్లో తలదూర్చితే సహించేది లేదని స్థానిక పోలీసులు ఈ విషయంలో చాలా జాగ్రత్తలు పాటించాలన్నారు. స్టాండర్డ్ ఆపరేటిం గ్ ప్రొసీజర్ ప్రకారం మాత్రమే నడుచుకోవాలన్నారు. అదే విధంగా గ్రామాల్లో చిన్న పిల్లలతో బిక్షాటన చేయిస్తుంటారని, అలాంటి వారిపై దృష్టి సారించడంతో పాటు అలాంటి వారి పట్ల చట్టరీత్యాచర్యలు తీసుకోవాలన్నారు. పిల్లలను అపహరించి వ్యభిచారంలోకి దింపడం, అమ్మడం, బలవంతపు వెట్టిచాకిరి, బలవంతపు బిక్షాటన, పిల్లలనుబంధించి పని చేయించడం, పిల్లల అవయవాలను అమ్ముకోవడంతో పాటు అక్రమంగా దత్తతతీసుకోవడం లాంటి కార్యకలాపాలు, మానవ అక్రమ రవాణా కిందకు వస్తాయని, పై కార్యకలాపాలు చేసే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకొని త్వరితగతిన శిక్షలు పడే విధంగా చేస్తామన్నారు. ఇలాంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే నేరుగాకాని, ఫోన్లో కాని సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. అదే విధంగా రకరకాలకారణాలతో తప్పిపోయిన, వదిలివేయబడిన కార్మికులుగా ఉన్న బాల బాలికలు ఉన్నట్లయితే అ లాంటి వారి సమాచారం సేకరించి రక్షించి వారి తల్లిదండ్రులకు అప్పగించి బలవంతంగా బిక్షాటన చేయించిన వారితో పాటు వెట్టి చాకిరి చేయిం చిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

న్యూఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

జిల్లా ప్రజలు న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. మద్యాన్ని సేవించి రోడ్లపై బైకులతో తిర గవద్దని, దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉం టుందని, ముఖ్యంగా యువత తమ తల్లిదండ్రులతో కలిసి సంతోషంగా వేడుకలను జరుపుకోవాలన్నారు. గంజాయి, మద్యం సేవించి రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతూ అలజడి సృష్టిస్తే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని, ఈ విష యాన్ని జిల్లా ప్రజలు అర్థం చేసుకొని పోలీసులకు సహకరించాలన్నారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని బాగాపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తుల్లో ఇద్దరు పారిపోగా ఇద్దరినీ పట్టుకొని వారి వద్ద నుంచి రూ.8వేల 2వందలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్సై సాయికుమార్ తెలిపారు. గ్రామాల్లో పేకాట ఆడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేకాట అసాంఘిక కార్యక్రమాలు జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

'సింగరేణి ఎన్నికల్లో టిఎన్‌టియుసి ఏ యూనియన్‌కి మద్దతు ఇవ్వడం లేదు'

నవతెలంగాణ-గోదావరిఖని

సింగరేణి ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో తెలుగుదేశం అనుబంధ సంఘం సింగరేణి కాలేరీస్ లేబర్ యూనియన్ టిఎన్‌టియుసి ఏ యూనియన్‌కి మద్దతు ఇవ్వడం లేదని, ఒంటరిగా పోటీ చేయనుందని టిఎన్‌టియుసి అధ్యక్షులు ఎంకే.బోస్ అన్నారు. సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మకాయల ఏడుకొండలు, టిఎన్‌టియుసి పెద్దపల్లి అధ్యక్షులు ముదిగంటి దామోదర్ రెడ్డి, చిటికెల రాజలింగు, కోశాధికారి పెగడపల్లి రాజానర్సులతో సంబంధం లేకుండా పెద్దపల్లి సత్యనారాయణ ఏకపక్షంగా కమిటీతో సంబంధం లేని వారితో ప్రెస్ మీట్లో ఐఎన్‌టియూసికి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించడం విడ్డురంగా ఉందని తెలిపారు. గత మూడు నెలలుగా సింగరేణి ఎన్నికల నేపథ్యంలో హడావుడి జరుగుతున్నందున మైన్ ల మీద ఎటువంటి ప్రచారం కానీ, కరపత్రం కానీ, బ్యాలెట్ నమూనా లేకుండా టిఎన్‌టియూసిపై అక్కసుతో కనీసం నాయకులతో ఎటువంటి చర్చలు జరుపకుండా పెద్దపల్లి సత్యనారాయణ ఐఎన్‌టియూసికి మద్దతు తెలపడం లోపాయికార ఒప్పందం కుదుర్చుకొని తీసుకున్న నిర్ణయంగా భావిస్తూ టిఎన్‌టియూసి తరపున తీవ్రంగా ఖండించారు. పెద్దపల్లి సత్యనారాయణపై పార్టీ అధిష్టానానికి కూడా లేఖ ద్వారా ఫిర్యాదు కూడా చేయడం జరిగిందని, పార్టీ అధిష్టానం సూచనల మేరకు సింగరేణి కాలేరీస్ లేబర్ యూనియన్ టిఎన్‌టియుసి ఒంటరిగా పోటీలో ఉంటుందని, ఆరవ 6 నెంబర్ మోటర్ సైకిల్ గుర్తుకు ఓటు వేసి కార్మికులు అధిక మెజారిటీతో టిఎస్ఎస్ఎఫ్‌ని గెలిపించాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బెక్కం వీరేందర్, సుందిళ్ళ స్వామి, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు





నవతెలంగాణ-లక్షెట్టిపేట

క్రిస్టమస్ పండగ సందర్భంగా సోమవారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు లక్షెట్టిపేట పట్టణంలోని సీఎస్ఐ చర్చిను సందర్శించి క్రైస్తవ సోదరులతో కలిసి రెవరెండ్ ఎస్.డేవిడ్ పాల్ చేసిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు మాట్లాడుతూ విశ్వమానవాళికి తన ప్రేమ తత్వంతో వెలుగులు పంచిన కరుణామయుడు, ప్రేమమూర్తి క్రీస్తు పుట్టిన రోజు సందర్భంగా నియోజకవర్గ క్రైస్తవ సోదరులు అందరూ ఘనంగా జరుపుకుంటున్నారని, ప్రేమ, సేవ, కరుణ, త్యాగం, క్షమాగుణం వంటి అత్యుత్తమ జీవన మార్గాలను మానవ సమాజానికి అందించి ఇతరుల కోసం జీవించడం అన్న కొత్త పలుకులను నేర్పిన క్రీస్తు జన్మదినం ఎంతో పవిత్రమైనది అన్నారు. ఏసుక్రీస్తు తన జీవితమే ఒక సందేశంగా జీవించిన కరుణామయుడని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతామని స్పష్టం చేశారు. అదేవిదంగా మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్యతో కలిసి కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, మండల అధ్యక్షులు పింగిళి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ షాహిద్ అలీ, బొప్పు సతీష్, వెన్న వెంకట స్వామి పాల్గొన్నారు.

జన్నారం : మండలంలోని వివిధ గ్రామాల్లోని పలు చర్చిలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చి, పలు గ్రామాలలో ఉన్న వివిధ చర్చిలలో చర్చి ఫాదర్లు, క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జీసస్ త్యాగాన్ని తలుచుకుంటూ భక్తి పాటలు పాడారు. చర్చి ఫాదర్లు క్రైస్తవులకు జీసస్ సందేశాలను వినిపించారు.

జైపూర్ : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో గల క్రైస్తవులు సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన చర్చిల్లో కేకట్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. మండల కేంద్రంలో గల జీసెస్ క్రైస్ట్ ఏజీ చర్చిలో జరుపుకున్న క్రిస్మస్ వేడుకల్లో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బలమూరి అరవింద్ రావు, స్థానిక ఎంపీటీసీ లింగస్వామి పాల్గొన్నారు.

కాసిపేట : సోమగూడెం, బెల్లంపల్లి రహదారి మధ్యలోని కల్వరీ చర్చిలో సోమవారం ఘనంగా క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ముఖ్య అతిథిగా వేడుకలకు హాజరయ్యారు. కల్వరీ పాస్టర్ ప్రవీణ్, క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనల అనంతరం కార్యక్రమానికి హాజరైన క్రైస్తవులను పాస్టర్ ప్రవీణ్ దీవించారు.





కుల బహిష్కరణ చేస్తే పట్టించుకోరా..?

- గ్రామ బహిష్కరణ చేసే హక్కు వీడీసీకి లేదు


కుల బహిష్కరణకు గురైన లక్ష్మణ్‌గౌడ్ కుటుంబం


నవతెలంగాణ-లోకేశ్వరం

సైన్సు రాకెట్ లా దూసుకుపోతున్న ఈ కాలంలో కూడా కుల బహిష్కరణ అంటూ పల్లెల్లో, పట్టణాల్లో కొంతమంది పాతకాలపు అలవాట్లనే అనుసరిస్తున్నారు. ఎవరైనా తప్పు చేస్తే సరిదిద్దాల్సిన స్థానంలో ఉండాల్సిన వాళ్లే, బహిష్కరణలకు పాల్పడుతున్నారు. గ్రామ బహిష్కరణ చేసే హక్కు వీడీసీకి లేదు. కాని వారు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటున్నారు. ఈ ఉదాంతం నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలంలో చోటుచేసుకుంది. బాధితుడు నరేష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. లోకేశ్వరం మండలంలోని పిప్రి గ్రామంలో కొద్ది కాలంగా కల్లుగీత వృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటుండగా ఇటీవల ఆయన రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. దీంతో ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో ప్రతి సంవత్సరం గ్రామాభివృద్ధి కమిటీకి చెల్లించే డబ్బులు సకాలంలో చెల్లించలేదు. దీనితో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సమావేశమై సమావేశ స్థలానికి రావాలని నరేష్‌గౌడ్‌కి కబురు పంపారు. కాగా కాలు, చేయి విరిగి కదలలేని స్థితిలో ఉన్నందున ప్రస్తుతం రాలేనని చెప్పడంతో తాము తీసుకోబోయే చర్యలకు బాధ్యత వహిస్తానని ఒక వ్యక్తిని జామీనుగా ఇవ్వాలని వారు సూచించినట్లు చెప్పారు. దీంతో నరేష్‌గౌడ్ ఒప్పుకోకపోవడంతో ఆయన కుటుంబానికి సంఘ బహిష్కరణ చేసినట్లు వాపోయారు. ఆయన నిర్వహించే కల్లు దుకాణంలో కల్లు కొనుగోలు చేయరాదని అలాగే ఆయన భార్య నిర్వహించే కిరాణా షాపులో సైతం గ్రామస్తులు సరుకులు కొనుగోలు చేస్తే రూ.50వేలు జరిమానా విధిస్తామని ప్రకటించినట్లు పేర్కొన్నారు. దీంతో గ్రామంలో ఎవరూ తమ దుకాణాలకు రావడంలేదని న్యాయం చేయాలంటూ లోకేశ్వరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

మరో కుటుంబంపైన రెండేళ్లుగా సాంఘీక బహిష్కరణ..

అదే గ్రామానికి చెందిన కుంట లక్ష్మణ్ అనే వ్యక్తిని కూడా సుమారు రెండేండ్ల నుంచి బహిష్కరణను కొనసాగిస్తున్నారు. ఆయన చేసి తప్పు వీడీసీకి జమానాథ్ ఇవ్వకపోవడమే. కుంట లక్ష్మణ్ ఉన్న వ్యవసాయ భూమిని ఒక వర్గానికి చెందిన వారికి మధ్య వివాదం సంభవించింది. అంతే అందులో వీడీసీ వారు ప్రమేయం చేసుకుని తమ మాట వినని కుంట లక్ష్మణ్ కుటుంబం మొత్తాన్ని కులం, సాంఘీక బహిష్కరణ విధించారు. అంతే రెండేండ్ల నుంచి అతని కుటుంబంతో ఎవరు మాట్లాడినా అతని వ్యవసాయ భూమిలోకి వెళ్లిన అతనికి ఏ చిన్న సాయం చేసిన వెంటనే వీడీసీలోకి పిలిచి జరిమానా విధిస్తారు. ఇలా రెండేండ్లుగా ఆ కుటుంబాన్ని వీడీసీ వేదింపులకు గురిచేస్తున్నా పోలీసులు, అధికారులు పట్టించుకోవట్లేదు. ఇంత జరుగుతున్నా మమ్మల్ని ఆదుకునే నాథుడే లేదని బాధిత కుటుంబాలు వాపోతున్నాయి.

విచారణ జరుపుతున్నాం : ఎస్ఐ సాయికుమార్



నరేష్‌గౌడ్ కుటుంబ సభ్యుల సామాజిక బహిష్కరణకు పాల్పడిన నలుగురు వీడీసీ కమిటీ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టానికి విరుద్ధంగా కుల, సాంఘిక బహిష్కరణల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేది ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.